సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)
సోమవారం । 11 । మార్చి । 2024



వరప్రదాయిని ఫాతిమామాత

ఏసుక్రీస్తు తల్లిగా ఫాతిమామాత భక్తుల వరప్రదాయినిగా విరాజిల్లుతోంది. ఫాతిమా ఫీస్ట్ ఉత్సవాలు నేడు కాజీపేట ఫాతిమానగర్ కెథడ్రల్ చర్చిలో ప్రారంభమవుతున్నాయి. - 8లో▸



అప్పుతెచ్చిన డబ్బు అగ్గిపాలు

ఇంటి నిర్మాణానికి, కూతురుకు ఇచ్చే కట్నం కోసం అప్పుగా తెచ్చిన డబ్బు అగ్నికి ఆహుతైంది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసె కాలిపోవడంతో ఈ ఘటన జరిగింది. - 8లో▸

గరిష్టం/కనిష్టం
37°/23°

వాతావరణం

ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయి. రాత్రి పూట చలి తగ్గిపోయి ఉక్కపోత అధికమవుతుంది.

న్యూస్‌రీల్

నేడు గ్రేటర్ వరంగల్ గ్రీవెన్స్

వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్(జీడబ్ల్యూఎంసీ) గ్రీవెన్స్ కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు అడిషనల్ కమిషనర్ అనిసుర్ రషీద్ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం వరకు రాతపూర్వకంగా దరఖాస్తులు స్వీకరిస్తామని, సమస్యలు ఎదుర్కొంటున్న ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఒక ప్రకటనలో సూచించారు.

ప్రవేశ పరీక్షకు 670 మంది హాజరు



విద్యారణ్యపురి: వివిధ ఉద్యోగాలకు నిర్వహించే పోటీపరీక్షలకు ఎస్సీ స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత శిక్షణ పొందేందుకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఆదివారం ప్రవేశపరీక్ష నిర్వహించారు. షెడ్యూల్ కులాల అభివృద్ధి సంస్థ ద్వారా అర్హత పొందిన అభ్యర్థులకు ఐదునెలల పాటు ఉచిత శిక్షణ అందజేస్తారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ ప్రవేశపరీక్ష నిర్వహించినట్లు సంస్థ అధికారి బి.నిర్మల, ఎస్సీ స్టడీ సర్కిల్ ఉమ్మడి వరంగల్ జిల్లా గౌరవ సంచాలకులు కె.జగన్‌మోహన్ తెలిపారు. పరీక్షకు 1,030 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 670మంది హాజరయ్యారని వారు తెలిపారు.

వరంగల్ కవయిత్రులకు సన్మానం



హన్మకొండ కల్చరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా వరంగల్‌కు చెందిన కవయిత్రులను ఆదివారం సికింద్రాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో సన్మానించారు. అక్షరయాన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన బహుభాషా కవి సమ్మేళనంలో రాష్ట్రపతి నిలయం ఇన్‌చార్జ్ రజినీప్రియ, అక్షరయాన్ వ్యవస్థాపకురాలు, తెలుగు యూనివర్సిటీ చిత్రవాణి స్టూడియో డైరెక్టర్ అయినంపూడి శ్రీలక్ష్మి, ప్రధాన కార్యదర్శి విశ్వైక.. వివిధ రాష్ట్రాలకు చెందిన బహుభాషా కవయిత్రులను సన్మానించారు. కార్యక్రమంలో వరంగల్ నుంచి అరుణకీర్తిపతాక రెడ్డి, బండారు సుజాత, వకుల వాసు, బాలబోయిన రమాదేవి, వాణిశ్రీ, ఉదయశ్రీ, లావణ్యరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



విద్యారణ్యపురి: ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ధర్మ టీచర్స్ యూనియన్ (డీటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామెర ఉపేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండలో నిర్వహించిన ధర్మ టీచర్స్ యూనియన్ ఆవిర్భావ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం కరపత్రాలు ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. 93శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ ఉపాధ్యాయుల పక్షాన పోరాడాలనే ధర్మ టీచర్స్ యూనియన్ ఆవిర్భవించిందని తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు లింగమల్లు యాదవ్, ఉపాధ్యక్షుడు నాతరి రమేష్, కార్యదర్శి సాంబయ్య మాట్లాడారు.

కాంగ్రెస్‌లో భారీగా చేరికలు



వర్ధన్నపేట: వర్ధన్నపేట మండలంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆదివారం హైదరాబాద్ గాంధీ భవన్‌లో కాంగ్రెస్‌లో చేరారు. డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు సమక్షంలో తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ దీపాదాస్‌మున్షీ వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కమ్మగోని స్వామి రాయుడు, ఆత్మ చైర్మన్ యాకూబ్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజు, పులి శ్రీనివాస్, అన్వర్, భాస్కర్, సుధాకర్, వీరరాఘవరావు, కాంతం, మహేందర్, దేవేంద్ర, తోట రవి, హఫీజా, ముంజ కృష్ణతో పాటు 100 మంది పార్టీలో చేరారు.

అందరూ అందరే..!

పనిలో నిబద్ధత కనిపించదు.. పారదర్శకత అసలే లేదు.. అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగా నగర పౌరులకు ఇబ్బందులు తప్పడంలేదు. సకాలంలో సేవలు అందక ప్రజలు సతమతమవుతున్నారు. క్షేత్ర స్థాయిలో సమస్యలను అధికారులు, సిబ్బంది గాలికి వదిలేశారు. 11లక్షల జనాభా కలిగిన మహానగరంలో స్థానిక కార్పొరేటర్ల నుంచి ఒత్తిడి వస్తే తప్ప చర్యలు తీసుకున్న దాఖలాలు మచ్చుకు కనిపించవు. - వరంగల్ అర్బన్



- టౌన్ ప్లానింగ్‌లో భవన నిర్మాణదారుడి స్వీయ దరఖాస్తే ప్రామాణికం అంటూ టీఎస్-బీపాస్ తీసుకొచ్చిన చట్టంలో దరఖాస్తు చేసుకున్నా.. సదరు యజమానికి టౌన్ ప్లానింగ్ సిబ్బంది పట్టపగలు చుక్కలు చూపిస్తున్నారు. సర్వేయర్ లేదా బ్రోకర్ ద్వారా వస్తేనే ఫైళ్లను పరిష్కరిస్తున్నారు. లేదంటే కొర్రీలు పెట్టి తిరస్కరిస్తున్నారు.
- పన్నుల విభాగంలో బల్దియాకు వచ్చే ఆదాయానికి గండిపెట్టి ప్రతి రూపాయిలో బిల్ కలెక్టర్ నుంచి కార్పొరేటర్లకు పర్సంటేజీలు కామన్ అయిపోయాయి. ప్రజారోగ్య విభాగంలో ట్రేడ్ లైసెన్స్, మటన్, చికెన్ సెంటర్లు, టిఫిన్ సెంటర్ నుంచి ఫైవ్‌స్టార్ హోటల్ వరకు మామూళ్లు ముట్టాల్సిందే. ఎందుకంటే పై వాళ్లకు వీరు సమర్పించుకోవాల్సి ఉంటుంది.
- ఇంజినీరింగ్ విభాగంలో తాగునీటి పైపులైన్ల లీకేజీలు ఇతర వ్యవహారాల్లో ఇదే పరిస్థితి దాపురించింది. నిధులు లేకపోయినా కమీషన్లు వదలడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.
- జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ వరకు చేతులు తడపాల్సిందే. అర్బన్ మలేరియాలో వాహనాల డ్రైవర్లు డీజిల్, పెట్రోల్‌ను పక్కదారి పట్టిస్తున్నారు.
- సాధారణ, పరిపాలన విభాగం ఉద్యోగంలో కొత్తగా చేరాలన్నా.. విరమణ పొందలన్నా.. ప్రమోషన్ రావాలన్నా.. కాసులు కురిపించే సెక్షన్లకు బదిలీ కావాలన్నా చేతులు తడపాల్సిందే.

బల్దియాలో పౌర సేవలపై స్పందన కరువు

- ప్రజా సమస్యలు పట్టని అధికారులు, సిబ్బంది
- పూర్తి స్థాయి కమిషనర్ లేరు.. అవసాన దశలో పాలక వర్గం

వరంగల్ మహా నగరపాలక సంస్థ పరిధి కాలనీల్లోని ప్రజలు వివిధ సమస్యలపై గ్రేటర్ వరంగల్ గ్రీవెన్స్‌లో అధికారులకు వందలు, వేల సంఖ్యలో ఫిర్యాదులు సమర్పిస్తున్నారు. వీటి పరిష్కారం విషయంతోపాటు ఇతర పౌర సేవలకు సంబంధించి అధికార యంత్రాంగం నాన్చుడు ధోరణి అవలంబించడం పరాకాష్టగా మారింది. కీలక ప్రధాన పరిపాలన అధికారి కమిషనర్ పోస్టు 20 రోజులుగా ఖాళీగా ఉంది. ఇన్‌చార్జ్ కమిషనర్‌గా కొద్ది రోజులు హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తాకు బాధ్యతలు అప్పగించగా.. ఆమె కొంత మేరకు క్షేత్ర స్థాయి పర్యటనలు చేశారు. తదుపరి వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను గ్రేటర్ ఫుల్ అడిషనల్ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా ప్రభుత్వం నియమించింది. దీంతో జిల్లా బాధ్యతలతో పాటు నగర పరిపాలనపై దృష్టిసారించడం కొంత ఇబ్బందిగా మారింది. ఈ నేపథ్యంలో వింగ్ అధికారులు 'అడిగే వారు ఎవ్వరూ' అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. దీన్ని అనరాగా చేసుకుని కింది స్థాయి సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటంతో పరిపాలన అధ్వానస్థితికి చేరుకుంది.

నిర్లక్ష్యం, మామూళ్ల వ్యవహారమే..

గ్రేటర్ వరంగల్ ఖజానాలో నిధులు నామమాత్రంగా ఉన్నాయి. పరిపాలన నిర్వహణకు ఆ సొమ్ము సరిపుచ్చలేక తంటాలు పడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు విడుదలైతేనే అభివృద్ధి పనులు ముందుకు సాగనున్నాయి. కీలకమైన ఇంజనీరింగ్ విభాగంలో గతంలో పిలిచిన అభివృద్ధి పనులకు మేజర్‌మెంట్ బుక్(ఎంబీ)లో వివరాల నమోదుకు, డీబీ సెక్షన్, వర్క్ ఇన్‌స్పెక్టర్, ఏఈ, డీఈ, ఈఈ, ఎస్ఈ, క్వాలిటీ కంట్రోల్, అకౌంట్, ఆడిట్ సెక్షన్లు, కార్పొరేటర్, పాలకవర్గం పెద్దలు ఇలా ప్రతీ సంతకానికి పర్సంటేజీలు ముడితేనే పనులు ముందుకు సాగుతున్నాయి. బడా కాంట్రాక్టర్లు, పరపతి కలిగిన కొందరు కాంట్రాక్టర్లు అభివృద్ధి పనులకు సంబంధించి లెక్కకట్టి కాసులు సమర్పిస్తూ బిల్లులు పాస్ చేయించుకుంటున్నారు. దీంతో సాధారణ కాంట్రాక్టర్ల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.

'అడకత్తెరలో పోక చెక్కలా'..

ఇక పాలక వర్గం పెద్దలు ఉన్నప్పటికీ వారి పరిస్థితి 'అడకత్తెరలో పోక చెక్కలా' తయారై పరిస్థితి అవసాన దశకు చేరింది. మేయర్, డిప్యూటీ మేయర్ల పదవులకు 'అవిశ్వాస తీర్మానం' గండం పొంచి ఉండటంతో వారు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు.

ప్రజల దీవెనలతో ఇందిరమ్మ రాజ్యం

అందరి ఆశలు, ఆకాంక్షలు నెరవేరుతాయి

- ధనిక రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన కేసీఆర్
- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- వరంగల్ నగరంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



వరంగల్ : ఎస్ఎస్ఎం క్లబ్ వద్ద పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రులు

వరంగల్ అర్బన్: ప్రజల దీవెనలతో ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకున్నాం.. ధనిక రాష్ట్రాన్ని పదేళ్లలో రూ.7లక్షల కోట్ల అప్పుల కుప్పగా మార్చిన కేసీఆర్‌కు తగిన గుణపాఠం చెప్పారు.. అందరి ఆశలు, ఆకాంక్షలు, కోరికలు నెరవేరుతాయని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వరంగల్ మహానగర అభివృద్ధిలో భాగంగా ఆదివారం ఎస్ఎస్ఎం క్లబ్ ప్రాంగణంలో రూ.280.85 కోట్ల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మంత్రులు కొండా సురేఖ, ధనసరి సీతక్క, నగర మేయర్ సుధారాణి, ఎమ్మెల్యేలతో కలసి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీల్లో ఇప్పటికే నాలుగు లబ్ధిదారుల చెంతకు చేరాయన్నారు. ప్రజల మనసులో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం(నేడు) ఆవిష్కరిస్తారని, ఎన్నికల నియమావళి రాకముందే ప్రజలకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు. ఇందిరమ్మ రాజ్యం వచ్చిన ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి.. కేవలం 72 రోజుల్లో 31 వేల కొలువులు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ సర్కారుకే దక్కుతుందన్నారు. 75 రోజుల్లోనే సుమారు 11,600 ఉపాధ్యాయ పోస్టులకు మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ ఇచ్చామని చెప్పారు. తొమ్మిది రోజుల పాటు ప్రజాపాలన నిర్వహించి మీ ఇంటి వద్దకే వచ్చి మీకు ఏంకావాలో తెలుసుకున్నాం.. మీ కోరికలను ఒక్కొక్కటిగా తీరుస్తున్నామని వివరించారు. ఉద్యోగులకు ఒకటి నుంచి మూడో తేదీలోగా జీతాలు ఇస్తున్న ప్రభుత్వం తమదని అన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలకు జరుగుతున్న మేలును చూసి ఓర్వలేని ఎమ్మెల్సీ కవిత అవాకులు, చవాకులు పేలుతున్నారని ధ్వజమెత్తారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, నాగరాజు, కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు, సీనియర్ సిటిజన్స్ శాఖ ఆధ్వర్యంలో రూ.19లక్షల విలువైన చెక్కులు, దివ్యాంగులకు 12 ద్విచక్రవాహనాలు, 5 బ్యాటరీ వీల్‌చైర్ వాహనాలు పంపిణీ చేశారు.

వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో..

హన్మకొండ: వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. హనుమకొండ సమ్మయ్యనగర్ వద్ద స్మార్ట్ సిటీ నిధులు రూ.2 కోట్లతో చేపట్టే కాజీపేట, ఫాతిమా క్వాలిటీ కంట్రోల్ డివిజన్, టీటీడీ జంక్షన్ అభివృద్ధి పనులు, టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.76.35 కోట్లతో చేట్టనున్న సమగ్ర వరదకాలువల నిర్మాణం, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2 కోట్లతో హనుమకొండ బాలసముద్రంలోని బాలబాలికలు, దివ్యాంగుల ఉద్యానవనం ఆధునీకీకరణ పనులకు మంత్రులు కొండా సురేఖ, ధనసరి సీతక్క, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి మంత్రి పొంగులేటి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్, అధికారులు పాల్గొన్నారు.

శ్రీరుద్రేశ్వరుడికి మహాన్నపూజ



పెరుగన్నంతో అలంకరించిన శివలింగం

హన్మకొండ కల్చరల్: మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం హనుమకొండలోని వేయిస్తంభాల ఆలయంలో శ్రీరుద్రేశ్వరస్వామి వారికి మహా అన్నపూజ నిర్వహించారు. దాతలు విజయ్‌మిశ్రా, సునీతామిశ్రా సౌజన్యంతో మిర్యాలపాడి మిళితం చేసిన 51 కిలోల పెరుగన్నంతో మహా శివలింగాన్ని అలంకరించి పూజలు చేశారు. ఆలయ ఈఓ వెంకటయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఇదిలా ఉండగా.. సోమవారం ఉదయం శ్రీఆంజనేయస్వామి వారికి చందనోత్సవం, ఆకుపూజ, శ్రీరుద్రేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు, మహాపూర్ణాహుతితో ఉత్సవాలు పరిసమాప్తి అవుతాయని ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు.

వైభవంగా ఉర్సు షరీఫ్



దర్గాపై పూల చాదర్ సమర్పిస్తున్న పీఠాధిపతి నవీద్‌బాబా, జబ్బార్ తదితరులు

ఖిలా వరంగల్: వరంగల్ ఫోర్ట్ రోడ్డు ఏకశిలనగర్‌లోని హజ్రత్ సయ్యద్ అబ్దుల్లా ఖాసీం షాహిద్ దర్గా అభివృద్ధి కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఆదివారం ఉర్సు ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఖిలావరంగల్ పెట్రోల్ బంక్ జంక్షన్‌లోని ఈద్గా మసీదు నుంచి పురవీధుల్లో జెండా, సందల్ ఊరేగింపు నిర్వహించారు. దర్గా అధ్యక్షుడు ఎంఏ జబ్బార్ ముందు నడుస్తుండగా.. ముస్లింలు ఎదురేగి మొక్కులు సమర్పించుకున్నారు. మతపెద్ద సమక్షంలో ప్రత్యేక ప్రార్థనలు చేసి పూలు, గంధం దర్గాకు సమర్పించారు. అంతకు ముందు కరీమాబాద్ దర్గా పీఠాధిపతి నవీద్ బాబా హజ్రత్ సయ్యద్ అబ్దుల్లా ఖాసీం షాహిద్ దర్గా సమాధిని దర్శించుకున్నారు. ఈ వేడుకలకు పలు జిల్లాలతో పాటు నగర నలుమూలల నుంచి అధిక సంఖ్యలో ముస్లింలు తరలివచ్చారు. వారికి దర్గా కమిటీ బాధ్యులు అవసరమైన తాగునీరు, వసతి సౌకర్యాలు కల్పించారు. ఈ కార్యక్రమంలో ముగ్దుం, అశ్రఫ్, ఆరీఫ్, చాంద్‌పాషా, మూషాక్, సర్వర్, సాలార్, హైమద్‌ఖాన్, అజహరొద్దీన్, హుస్సేన్ అలీబేగ్, దస్తగిరి, జానీ, ఖాజా, ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ మీదుగా మరో 'వందేభారత్'

- సికింద్రాబాద్ నుంచి వైజాగ్‌కు..
- రేపటి నుంచి రైలు ప్రారంభం



వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు (ఫైల్)

కాశిబుగ్గ: వరంగల్ మీదుగా సికింద్రాబాద్, విశాఖపట్నం మధ్య మరో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు మంగళవారం(రేపు) నుంచి నడవనుంది. దీనిని దేశ ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా సికింద్రాబాద్ నుంచి ప్రారంభించనున్నారు. ప్రస్తుతం ఇదే మార్గంలో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు 100 శాతం ఆక్యుపెన్సీతో నడుస్తుండగా ప్రయాణికుల సౌకర్యార్థం మరో రైలును అందుబాటులోకి తీసుకువచ్చినట్లు రైల్వే అధికారులు ప్రకటనలో తెలిపారు. ఈ రైలు గురువారం మినహా వారంలో 6 రోజులు నడుస్తుందని, 7 ఏసీ చైర్‌కార్ కోచ్‌లు, ఒక ఎగ్జిక్యూటివ్ ఏసీ చైర్‌కార్‌తో మొత్తం 8 కోచ్‌లు కలిగి 530 మంది ప్రయాణికులు ప్రయాణం చేయవచ్చని పేర్కొన్నారు. టికెట్ల బుకింగ్ ఈనెల 12 నుంచి అందుబాటులోకి వస్తాయని వివరించారు. ఈ రైలు (20707) సికింద్రాబాద్ నుంచి ఉదయం 5.05 గంటలకు ప్రారంభమై 6.39కి వరంగల్‌కు చేరుకుంటుంది. 6.40కి ఇక్కడి నుంచి ప్రారంభమై 7.43 గంటలకు ఖమ్మం, 9.05 గంటలకు విజయవాడ, 11.00 గంటలకు రాజమండ్రి, 11.43కు సామర్లకోట, మధ్యాహ్నం 1.50 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. తిరిగి అదేరైలు(20708) విశాఖపట్నంలో మధ్యాహ్నం 14.35(2.35)కు బయలుదేరి 21.03 గంటలకు వరంగల్‌కు, రాత్రి 23.20 గంటలకు సికింద్రాబాద్ స్టేషన్‌కు చేరుకుంటుంది.

పైసలిస్తేనే ఫైల్ కదిలేది..!

'పైసలిస్తేనే ఫైల్ ముందుకు కదులుతుంది.. లేదంటే రకరకాల కొర్రీలతో వెనక్కి వస్తుంది.. నెలలకొద్ది తిరిగినా సమస్య పరిష్కారం కాదు.. ఇక ఆ దస్త్రం ఎక్కడ ఉందో ఎవరికీ తెలియదు.. చెప్పేవారూ ఉండరు'.. ఇదీ కలెక్టరేట్‌లోని ధరణి సెక్షన్ తీరు. - హన్మకొండ అర్బన్



ధరణి
తెలంగాణ ప్రభుత్వం

- కాజీపేట మండలం సోమిడి పరిధి 126 సర్వే నంబర్‌లోని సీలింగ్ ల్యాండ్‌ను ఉన్నతాధికారుల కళ్లుగప్పి సెక్షన్ అధికారులు పట్టాల్యాండ్‌గా మార్చడానికి సహకరించారు. ఈవిషయంలో అధికారులను తప్పుదోవ పట్టించి పెద్ద మొత్తంలో వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి.
- మడికొండ పరిధి 763 ఒక సర్వే నంబర్‌లో 10 ఎకరాలకుపైగా నాన్ అగ్రికల్చర్ ల్యాండ్ ఉండగా అగ్రికల్చర్ ల్యాండ్‌గా మార్చి పాస్‌బుక్ వచ్చేలా చేశారు. 'రైతుబంధు' డబ్బులు పొందడానికి రిజిస్టర్ డాక్యుమెంట్‌లో ఇద్దరు పేర్లు ఉండగా ధరణిలోకి ఒకే పేరు నమోదుచేశారు. ఓ గ్రానైట్ సంస్థకు అనుకూలంగా ఫైళ్లు చక్కదిద్దగా.. పెద్ద మొత్తంలో చేతులు మారినట్లు తెలుస్తోంది.
- కాజీపేట మండల పరిధి శాయంపేటకు సంబంధించి ఓ ఫైల్ అప్రూవల్ చేస్తూ ఉన్నతాధికారులు సంతకం చేసినా.. తప్పుడు సమాచారం ఇచ్చి దాన్ని కొట్టి వేయించారు. తర్వాత ఈ వ్యవహారమై కలెక్టరేట్‌లోని బాత్‌రూంలో 'బేరం' కుదిరినాక అదే ఫైల్ అప్రూవల్ చేయించారు. ఈ విషయంలో పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు సమాచారం.

లేదంటే కొర్రీలతో వెనక్కి

- అక్రమాలకు అడ్డాగా 'ధరణి' సెక్షన్
- చట్టం వచ్చిన నాటి నుంచి అదే కుర్చీ..
- ఎన్నికల పుణ్యమా అని ఒక్కరే బదిలీ
- బాత్రూంలో రాయ'బేరం'.. అక్కడే సెటిల్ మెంట్లు

వ్యవసాయ భూముల రక్షణకు తీసుకువచ్చిన ధరణి చట్టం రైతుల పాలిట శాపంగా మారింది. అందులో సమూల మార్పులు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అయితే చట్టంలోనే కాదు.. దానిని అమలు చేసే అధికారుల్లో అక్రమార్కులు తయారయ్యారు. అందులోని లొసుగులను అనుకూలంగా మార్చుకుని రైతులను ముప్పుతిప్పలు పెడుతున్నారు. ధరణి సెక్షన్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రాజకీయ నేతలు, దళారులకు మాత్రమే పనులు సాఫీగా సాగుతాయి. సామాన్యులకు చుక్కెదురే. నెలల తరబడి తిరిగినా ఫైల్ కదలదు.. అసలు సమస్య ఏమిటో ఎవరూ చెప్పరు. ఒక వేళ ఎవరైనా తెలిసిన వాళ్లు ఫైల్ గురించి ఆరా తీసినా.. అధికారులకు ఎక్కడా లేని ఆగ్రహం వస్తుంది. చివరికి ఆ ఫైల్ తిరిగి రాకుండా నానా కొర్రీలు పెట్టి వెనక్కి పంపుతారు. ఇలాంటి ఘటనలు కలెక్టరేట్‌లోని ధరణి సెక్షన్‌లో కోకొల్లలు.

బాత్రూంలో బాగోతం

ధరణి సెక్షన్‌లో పనిచేసే ఉద్యోగులు అక్రమాల సెటిల్‌మెంట్లకు కలెక్టరేట్‌లోని టాయిలెట్లను అడ్డాగా వాడుకుంటున్నారని బాధితులే స్వయంగా చెబుతున్నారు. వ్యవహారం ఏదైనా ముందు అక్కడే సెటిల్ చేసుకోవాలనే డిమాండ్. ఇక్కడ మ్యాటర్ సెటిల్ అయితే పని అయినట్లే లెక్క. ఇదిలా ఉండగా ఈ సెక్షన్‌లో పనిచేసే వారితో మండలాలకు చెందిన తహసీల్దార్లు గట్టిగా మాట్లాడినా.. ఇక ఆ మండలం ఫైళ్లు ముందుకు వెళ్లడం కష్టమేనని చర్చ జరుగుతోంది.

ఎన్నికల పుణ్యమా అని..

ఇటీవల ఎన్నికల బదిలీల నేపథ్యంలో ధరణి సెక్షన్‌లో కొందరికి స్థానచలనం కలిగింది. అయితే మిగతావారి పరిస్థితిలో ఏమాత్రం మార్పులేదు. ఎందుకంటే.. ఏళ్ల తరబడి పాతుకుపోయి ఉండడం.. వారు ఆడింది ఆట.. పాడింది పాటగా నడుస్తోంది. పెద్ద మొత్తంలో స్థలాలు, భూముల విషయంలో కొర్రీలు పెట్టడంలో వీరిని మించిన వారు లేరని చెప్పుకుంటున్నారు. మ్యాటర్ సెటిల్ అయ్యాక సమస్యను వారే స్వయంగా పరిష్కరిస్తారు.

సైబర్ క్రైం మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



సర్టిఫికెట్లు అందుకున్న చిన్నారులతో ఏసీపీ

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఓరుగల్లు కళావైభవం' చిత్రలేఖన పోటీల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సైబర్ క్రైం ఏసీపీ విజయ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ క్రైమ్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకులు సాగంటి మంజుల మాట్లాడుతూ.. ఓరుగల్లు అంటేనే కళలకు ప్రసిద్ధి అని, చిన్నారుల్లో చిత్రలేఖనంపై ఆసక్తి కనబరిచి, వారిలో దాగివున్న సృజనాత్మకతను వెలికితీయడమే లక్ష్యమన్నారు. ఇందుకు ప్రతి రెండు నెలలకోసారి చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన చిన్నారులకు ఏసీపీ విజయ్‌కుమార్ సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నిమ్మల శ్రీనివాస్, టీవీ అశోక్‌కుమార్, దామోదర్, చిరంజీవి, చారీ, సంజన, సాయికిరణ్, విరాట్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మల్లన్న బ్రహ్మోత్సవాలు



రంగులు చల్లుకుని నృత్యాలు చేస్తున్న అర్చక బృందం, ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు

ఐనవోలు: ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఉదయం ఆలయ మాడ వీధుల్లో స్వామి, అమ్మవార్లను పర్వత వాహనంపై ఊరేగించారు. రుద్రహోమం, చండీహోమం, మహా పూర్ణాహుతి, చూర్ణోత్సవం, వసంతోత్సవం, త్రిశూల స్నానం కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆశీర్వచనం, పండిత సన్మానాది కార్యక్రమాలు జరిగాయి. రాత్రి ఒగ్గు పూజారులు పవళింపు సేవ చేయగా పుష్పోత్సవం, ఏకాంత సేవలు చేపట్టారు. ఈఓ నాగేశ్వర్‌రావు, ఉపప్రధాన అర్చకుడు పాతర్ల పాటి రవీందర్, ముఖ్య అర్చకులు శ్రీనివాస్, మధుకర్ శర్మ, వేద పండితులు గట్టు పురుషోత్తమ శర్మ, విక్రాంత్ వినాయక్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వ్యక్తికి తీవ్రగాయాలు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని కమ్మరిగూడెంలో తాటిచెట్టు మీద పడడంతో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. కమ్మరిగూడేనికి చెందిన సబక సర్వేశ్వర్‌రావు గ్రామ సమీపంలోని తన వ్యవసాయ భూమిలో ఉన్న తాటిచెట్లను జేసీబీ సాయంతో తొలగించి చేను శుభ్రం చేసుకుంటున్నాడని తెలిపారు. జేసీబీతో తాటిచెట్టును తొలగిస్తున్న క్రమంలో చెట్టుకు కొంతదూరంలో సర్వేశ్వరావు నిలబడి ఉన్నాడన్నారు. జేసీ బీ తాటిచెట్టును కింద పడేస్తుండగా చెట్టుకొమ్మలు సర్వేశ్వరావుపై పడ్డాయని తెలిపారు. దీంతో అతని తలకు తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్తులు ఆటోలో చికిత్స నిమిత్తం వెంకటాపురం వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యంకోసం ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి..

ఖిలా వరంగల్: వరంగల్ ఫోర్ట్‌పై పెట్రోల్ బంక్ జంక్షన్‌లో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మధ్యకోటకు చెందిన మొగిలిచెర్ల శ్రీకాంత్(40) తలకు బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో హుటాహుటిన ఎంజీఎంకు తరలించారు. అతడి పరిస్థితి విషంగానే ఉందని తెలిసింది. అలాగే ఆదివారం సాయంత్రం గిర్మాజీపేటకు చెందిన కాసర్ల రాంబాబు కుమార్తె నీరజ, కుమారుడు గణేష్ బైక్‌పై రంగశాయిపేట నుంచి వరంగల్‌కు బయల్దేరారు. ఈ క్రమంలో నాగమయ్య కమాన్‌దాటగానే వాహనం అదుపు తప్పి కింద పడిపోయారు. ఈ ఘటనలో నీరజ, గణేష్‌కు గాయాలయ్యాయి. ఆ సమయంలో అటుగా వెళ్తున్న మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ పి.మల్లయ్య స్పందించారు. క్షతగాత్రులను తన వాహనంలో ఎంజీఎంకు తరలించే ప్రయత్నం చేస్తుండగా సమయానికి చేరిన 108 వాహనంలో ఎంజీఎంకు తరలించారు.

కల్తీ పెట్రోల్‌పై వాహనదారుల ఆందోళన

నడికూడ: మండలంలోని కంఠాత్మకూర్ గ్రామ శివారులోని కనకదుర్గ పెట్రోల్‌బంకులో కల్తీ పెట్రోల్ విక్రయిస్తున్నారని వాహనదారులు ఆదివారం ఆందోళనకు దిగారు. కంఠాత్మకూర్‌కు చెందిన అఖిరానందన్ తన బైక్‌లో పెట్రోల్ పోసుకొని కొద్ది దూరం వెళ్లగా, బైక్ మొరాయించడంతో అనుమానం వచ్చి మెకానిక్ వద్ద బైక్‌ను చూపించాడు. బాటిల్‌లో పెట్రోల్ తీసి చూడగా పెట్రోల్ కల్తీ అయినట్లు గుర్తించి వెంటనే పెట్రోల్‌బంకు సిబ్బందికి చూపించి నిలదీశారు. అనంతరం బంకు వద్ద ఆందోళన చేపట్టాడు. పెట్రోల్ బంకుపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

వరప్రదాయిని ఫాతిమామాత

నేడు ఉత్సవాలు ప్రారంభం
- 71వ ఉత్సవాలకు సర్వం సిద్ధం
- 11, 12, 13తేదీల్లో నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తి
- వివిధ జిల్లాల నుంచి భక్తుల రాక



విద్యుత్ కాంతులతో ఫాతిమానగర్ కేథడ్రల్ చర్చి

కాజీపేట రూరల్ : ఏసుక్రీస్తు తల్లిగా ఫాతిమామాత భక్తుల వరప్రదాయినిగా గ్రేటర్ వరంగల్‌లో కాజీపేట ఫాతిమానగర్‌లోని కేథడ్రల్ చర్చిలో విరాజిల్లుతోంది. మేత్రాసన పీఠాధిపతి బిషప్ ఉడుములబాల ఆధ్వర్యంలో ఈ నెల 11, 12, 13వ తేదీల్లో 71వ ఫాతిమామాత వేడుకలు వైభవంగా జరుగనున్నాయని తెలిపారు. ఓరుగల్లు డయాసిస్ కమిటీ ఆధ్వర్యంలో సర్వం సిద్ధం చేసిందని బిషప్ సెక్రటరీ ఫాదర్ అనుకిరణ్ వెల్లడించారు. తెలంగాణలో సుమారు 12జిల్లాల(మేత్రాసనం పీఠాధిపతి పరిధి) నుంచి భక్తులు రానున్నారని, చర్చిని, ఫాతిమామాత గుహను విద్యుత్ కాంతులతో అలంకరించి, ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.

నవదిన ప్రార్థనలతో ప్రారంభం


ఈ నెల 3న ఫాతిమా ఫీస్ట్ ఉత్సవాలను నవదిన ప్రార్థనలతో ఓరుగల్లు మేత్రాసం పీఠాధిపతి డాక్టర్ ఉడుములబాల ప్రారంభించారు. 12వ తేదీ సాయంత్రం ఫాతిమానగర్ పురవీధుల్లో ఫాతిమామాత స్వరూపంతో ఊరేగింపు మహా రథ ప్రదక్షిణ, కొవ్వొత్తులతో దివ్యప్రసాద ప్రదక్షిణ-దివ్య ప్రసాద ఆశీర్వాదంతో ముగింపు ఉంటుంది. ఉత్సవాల్లో హైదరాబాద్ అగ్రపీఠాధిపతి కార్డినల్ పూల అంథోని ముఖ్య అతిథిగా పాల్గొంటారని కమిటీ బాధ్యులు వెల్లడించారు.

ఫాతిమా చర్చికి ఘన చరిత్ర

1949లో ఆనాటి హైదరాబాద్ వికార్ మోన్సీగ్నోర్ అల్ఫోన్స్ బెరెట్టా వరంగల్ మేత్రాసనం ఏర్పాటుకు అనేక ప్రయత్నాల అనంతరం ప్రస్తుత ఫాతిమానగర్ స్థలం 71ఎకరాలు కొనుగోలు చేశారు. ఆనాటి ప్రభుత్వం మేత్రాసనం భవన నిర్మాణానికి అనుమతి నిరాకరించారు. ఈ క్రమంలో బిషప్ బెరెట్టా సతమతమవుతున్న క్రమంలో పోర్చుగీసు దేశం నుంచి ఫాతిమామాత స్వరూపం హైదరాబాద్‌కు 1960 మే 14వ తేదీన తీసుకొచ్చారు. ఫాతిమామాత స్వరూపం వద్ద బిషప్ బెరెట్టా ప్రార్థనలు చేయగా ఆటంకాలు తొలగిపోయాయి. 1961 జనవరి 14న ఓరుగల్లు పీఠాధిపతుల నిలయానికి శంకుస్థాపన చేశారు. బిషప్ బెరెట్టా అనుమతితో ఈ ప్రాంతానికి బ్రదర్ సాలా ఫాతిమానగర్ అని నామకరణం చేసి ఈ మేత్రాసనాన్ని ఫాతిమా తల్లికి అంకితమిచ్చారు. అప్పటి నుంచి ఈ ప్రాంతం ఫాతిమానగర్‌గా ఫాతిమామాత దేవాయలంగా ప్రాచుర్యంలోకి వచ్చింది.

అద్భుత రాతి కట్టడం

1956లో బిషప్ బెరెట్టా ఫాతిమామాత పేరుమీద కేథడ్రల్ చర్చి నిర్మాణానికి శంకుస్థాపన చేసి బ్రదర్ సాలాకు నిర్మాణ పనులు అప్పగించారు. ములుగు ప్రాంతం నుంచి ప్రత్యేక రాతిని తెప్పించి సుమారు 6సంవత్సరాలపాటు శ్రమించి కట్టడాన్ని నిర్మించారు. 1962 మార్చి 13న బిషప్ బెరెట్టా ఫాతిమామాత దేవాలయాన్ని ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి ఇక్కడ ప్రార్థనలు, పండుగలకు నిలయం. క్రీస్తు తల్లి ఫాతిమామాత విన్నప ప్రార్థనల ద్వారా దేవుడు ఈ మేత్రాసనంపై ఎంతో మేళ్లను, అనుగ్రహాలను కురిపిస్తున్నారని భక్తుల విశ్వాసం. ఫాతిమామాత గౌరవార్థం మేత్రాసన స్థాయిలో ప్రతి ఏటా మతాలకు అతీతంగా పండుగాలు జరుగుతున్నాయి.



విద్యుత్ కాంతులతో అలంకరించిన ఫాతిమామాత గుహ

గుహ ప్రత్యేక ముస్తాబు

ఫాతిమా ఉత్సవాలకు ఫాతిమామాత గుహను విద్యుత్ కాంతులతో సుందరంగా అలంకరించారు. ఉత్సవాల ముగింపు వరకు భక్తులు గుహ వద్ద కొబ్బరి కాయలు, క్యాండిల్స్ వెలిగించి ప్రార్థనలు చేసి తమ కోర్కెలు తీర్చమని వేడుకుంటారు.

టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేశాం



కేయూలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రులు పొంగులేటి శ్రీనివాస్, సురేఖ, సీతక్క తదితరులు

నిరుద్యోగులను విస్మరించిన బీఆర్ఎస్
- కాంట్రాక్టు లెక్చరర్ల రెగ్యులరైజేషన్‌పై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి..
- కేయూలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన
- పాల్గొన్న మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, సీతక్క

కేయూ క్యాంపస్: ప్రత్యేక రాష్ట్ర సాధనలో యూనివర్సిటీల్లోని యువత కీలకపాత్ర పోషించారని, పదేళ్లలో గత ప్రభుత్వం నిరుద్యోగ యువతను విస్మరించిందని.. కాంగ్రెస్ ప్రభుత్వం టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని రాష్ట్ర మంత్రి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కాకతీయ యూనివర్సిటీలో వీసీ ఆచార్య తాటికొండ రమేష్ అధ్యక్షతన మంత్రులు దనసరి అనసూయ(సీతక్క), కొండా సురేఖ, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజులతో మంత్రి పొంగులేటి కలిసి కే హబ్‌తోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. కే హబ్‌ను ప్రారంభించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. మార్పురావాలి ప్రజాపాలన రావాలని ప్రజలు కోరుకున్నారని అన్నారు. వారు కోరుకున్నట్లుగానే ఎన్నికల హామీలను నెరవేరుస్తున్నామని తెలిపారు. ఈనెల 11న భద్రాచలం రాముడి పాదాల వద్దనుంచే అర్హులైన లబ్ధిదారుల కోసం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నట్లు పొంగులేటి వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో టీఎస్‌పీఎస్సీ ఉద్యోగాల భర్తీలో నిర్లక్ష్యం వహించిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోనికి రాగానే అప్పటి టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి అర్హులైనవారిని టీఎస్‌పీఎస్సీలో నియమించిందన్నారు. రాష్ట్రంలో 2లక్షలు ఉద్యోగాల ఖాళీ ఉన్నట్లు గుర్తించామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో 70రోజుల్లోనే 31వేల ఉద్యోగాలు భర్తీచేశారన్నారు. అలాగే టీఎస్‌పీఎస్సీ ద్వారా పలు నోటిఫికేషన్లు ఇచ్చినట్లు పేర్కొన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 11,062వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి కూడా ప్రభుత్వం ముందుకొచ్చిందన్నారు. కేయూలో పలువురు కాంట్రాక్టు అధ్యాపకులు రెగ్యులరైజ్ కావాలని, ఉద్యోగ భద్రత కావాలని తమకు విన్నవించారని.. ఈ అంశాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. పదేళ్లలో గత ప్రభుత్వంలోని మంత్రులెవరు కేయూలోకి రాలేదని తెలిపారు. యూనివర్సిటీలో రూ.14 కోట్ల విలువచేసే అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. ఆయా కార్యక్రమాల్లో కేయూ వీసీ ఆచార్య తాటికొండ రమేష్, రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి, బిల్డింగ్ డివిజన్ అధికారి ఆచార్య వాసుదేవరెడ్డి, కలెక్టర్ సిక్తాపట్నాయక్, ఐటీడీఏ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హేమలత, టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్ గాదె దయాకర్ పాల్గొన్నారు.

పెరిగిన విద్యుత్ వినియోగం

- టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

హన్మకొండ: వినియోగదారులకు అంతరాయాలు లేకుండా మెరుగైన, సరఫరాతో రాష్ట్రంలో విద్యుత్ వినియోగం పెరిగిందని టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి తెలి పారు. రాష్ట్రంలో 15,623 మెగావాట్ల విద్యుత్ విని యోగం జరిగినట్లు రికార్డు నమోదైందని, 303.6 మిలియన్ యూనిట్ల మైలు రాయిని చేరుకున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి విద్యుత్ అధికారులు, ఉద్యోగులు అహర్నిశలు శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో 2022–23 ఆర్థిక సంవత్సరం డిసెంబర్, జనవరి, ఫిబ్రవరితో పోల్చుకుంటే 33 కేవీ బ్రేక్‌డౌన్స్ 506 ఉండగా.. 2023–24 ఆర్థిక సంవత్సరం డిసెంబర్, జనవరి, ఫిబ్రవరిలో కేవలం 313 మాత్రమే అయ్యాయని, 38 శాతం బ్రేక్ డౌన్స్ తగ్గాయని వివరించారు. అలాగే 33 కేవీ ట్రిప్పింగ్స్ 14 శాతం, ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలు 25 శాతం, పవర్ 23 శాతం తగ్గాయన్నారు. జంపర్లను సరిచేస్తూ.. ఒరిగిన స్తంభాలను సరిచేస్తూ.. 200 ఫీడర్లపై కెపాసిటర్ బ్యాంకులను అమర్చి 530 ఫీడర్లలో ప వర్ ఫ్యాక్టర్‌ను నిర్వహించడం ద్వారా లోవోల్టేజీ సమస్యను నివారించినట్లు పేర్కొన్నారు. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ అందిస్తున్నామని, వేసవిలోనూ కొనసాగించేందుకు సిద్ధంగా ఉన్నట్లు వివరించారు.

అప్పు తెచ్చిన డబ్బు అగ్గిపాలు

- విద్యుత్ షాట్ సర్క్యూట్‌తో పూరిగుడిసె దగ్ధం
- కాలిపోయిన బంగారం, వెండి, నగదు



కాలిబూడిదైన పూరి గుడిసె



మంటల్లో కాలిపోయిన నగదు

దుగ్గొండి: ఇల్లు నిర్మాణంతోపాటు, వరకట్నంగా ఇచ్చేందుకు అప్పుగా తీసుకున్న డబ్బులు అగ్ని ప్రమాదంలో కాలిబూడిదైన ఘటన వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. ఈప్రమాదంతో రూ.10లక్షల వరకు ఆస్తినష్టం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గిర్నిబావి గ్రామానికి చెందిన రాయపురి నర్సయ్య ఇంటి నిర్మాణం చేసుకుంటున్న క్రమంలో పక్కనే పూరిగుడిసె వేసుకుని అందులో నివాసం ఉంటున్నాడు. వేసవి కాలం కావడంతో గుడిసె ముందర ఖాళీ స్థలంలో శనివారం రాత్రి నిద్రకు ఉపక్రమించారు. ఆదివారం తెల్లవారుజామున విద్యుత్ షాట్ సర్క్యూట్ జరిగి మంటలు లేచి గుడిసె అంటుకుంది. మంటలు ఎక్కువ కావడం, గుడిసెలోని ఫ్రిడ్జిలోని గ్యాస్ పేలిపోయి భారీ శబ్దం రావడంతో మేల్కొన్న నర్సయ్య కుటుంబ సభ్యులు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే ఇల్లు పూర్తిగా కాలి పోయింది. ఇంటి నిర్మాణం కోసం అప్పు తెచ్చుకున్న డబ్బులతోపాటు, బిడ్డ పెళ్లి సందర్భంగా అల్లుడికి ఇవ్వాల్సిన డబ్బుల కోసం అప్పు తెచ్చి రూ.4లక్షలు కాలిపోయాయి. నోట్ల కట్టలు సగం కాలిపోగా 4తులాల బంగారు, 100తులాల వెండి కాలిపోయింది. ఇంట్లోని ఫ్రిడ్జి, టీవీ, ఫ్యాన్, బీరువాలు, వాటిలోని దుస్తులు, వస్తువులన్నీ బూడిదయ్యాయి. కట్టుబట్టలు తప్ప ఏమీలేకుండా కాలిపోయాయి. సమాచారం అందుకున్న ఎస్సై జక్కుల పరమేష్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. కాగా, బాధితుడిని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఓదార్చారు. వివరాలు అడిగి తెలుసుకున్నాడు. అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

నాటకాలు నిజజీవితానికి ప్రతిబింబాలు

- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా




మాట్లాడుతున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

హన్మకొండ కల్చరల్ : నాటకాలు నిజజీవితానికి ప్రతిబింబాలని, మానవీయ విలువలు పెంపొందించేలా ఉండాలని, యువతను సన్మార్గంలో నడపడానికి తోడ్పడాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అన్నారు. వరంగల్ సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో నిర్వహిస్తున్న తెలుగు భాషా ఆహ్వాన నాటక పోటీల్లో భాగంగా రెండోరోజు ఆదివారం సంస్థ అధ్యక్షుడు గన్నమరాజు గిరిజామనోహరబాబు అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీపీ అంబర్‌కిశోర్ ఝా ఆత్మీయ అతిథులుగా డాక్టర్ కేఎల్వీ ప్రసాద్, డాక్టర్ ఏవీ నరసింహారావు పాల్గొని పోటీలను ప్రారంభించి మాట్లాడారు. గుంటూరు అభినయ ఆర్ట్స్ వారి ఇంద్రప్రస్థం, కరీంనగర్ చైతన్య కళాభారతి వారి స్వప్నం రాల్చిన అమృతం నాటక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో పారితోషిక దాతలు సంస్థ సాహిత్య కార్యదర్శి మల్యాల మనోహరరావు, హైదరాబాద్ చీఫ్ ఇంజనీర్ ఇరిగేషన్ క్వాలిటీ కంట్రోల్ పరాంకుశం వెంకటకృష్ణ, సంస్థ ప్రధానకార్యదర్శి కుందావజ్జుల కృష్ణమూర్తి, సాంస్కృతిక కార్యదర్శి వనం లక్ష్మీకాంతారావు, ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్వీఎన్ చారి, సభ్యులు రాధాకృష్ణ, జూలూరు నాగరాజు, కళారాజేశ్వర్, సీత వెంకట్, నాగిళ్ల రామశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

సమ్మక్క-సారలమ్మ చరిత్రను ప్రపంచానికి చాటాలి

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



మాట్లాడుతున్న మంత్రి సీతక్క

హసన్‌పర్తి : వన దేవతలైన సమ్మక్క-సారలమ్మ చరిత్రను ప్రపంచానికి చాటి చెప్పాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాలపురంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివాసీ(కోయ) ఉద్యోగుల సంఘం ట్రెసిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమావేశానికి సీ తక్క ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. మేడారం జంపన్న వాగు సుందరీకరణకు అధిక నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తానన్నారు. ఆదివాసీల పరిరక్షణకు కృషి చేస్తానని, ఐటీడీఏ ద్వారా వారి అభివృద్ధి-సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోందన్నారు. ఈ సందర్భంగా మంత్రిని శాలువా, మెమొంటోతో సన్మానించారు. ఈ సమ్మేళనంలో ట్రెసిటీ కమిటీ అధ్యక్షుడు వాసం పాపయ్య, ప్రధాన కార్యదర్శి బుగ్గ నాగేశ్వర్‌రావు, కోశాధికారి ధనసరి రమేష్, జిల్లా నాయకులు సో యం ఓదెలు, చుంచ పాపయ్య, యాప సమ్మయ్య, ప్రొఫెసర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతోనే స్నేహభావం పెంపొందుతుంది

- జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ పూర్ణిమ
- ముగిసిన రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ టోర్నమెంట్



విజేతగా నిలిచిన క్రీడాకారులతో నవోదయ జ ప్రిన్సిపాల్ పూర్ణిమ, ఏకశిలా యూత్ బాధ్యులు

మామునూరు : క్రీడలతో విద్యార్థుల మధ్య స్నేహభావం, పోటీతత్వం, క్రమశిక్షణే పెంపొందుతాయిన జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ పూర్ణిమ అన్నారు. ఖిలావరంగల్ మండలం తిమ్మాపురంలోని క్రీడామైదానంలో ఏకశిలా యూత్ అసోసియేషన్, లైబ్రరీ ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. బ్యాడ్మింటన్ నేషనల్ క్రీడాకారుడు కల్లెపు సురేందర్ అధ్యక్షతన జరిగిన ముగింపు సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. యువత అంతర్జాతీయ క్రీడాకారులను ఆదర్శంగా తీసుకుని పాఠశాల స్థాయి నుంచే క్రీడలపై మక్కువ పెంచుకుని అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని సూచించారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. క్రీడల్లో రాణించిన విద్యార్థులను ప్రభుత్వ గుర్తించి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించిన క్రీడాకారులు కోకొల్లలుగా ఉన్నారని గుర్తుచేశారు. అనంతరం వరంగల్ ఎంగ్‌స్టార్స్ ప్రథమ, తిమ్మాపురం ద్వితీయ, షాద్‌నగర్ మహబూబ్‌నగర్ తృతీయ, బీహెచ్ఎల్ మెదక్ నాలుగో స్థానంలో నిలిచింది. ఈ జట్లకు నవోదయ ప్రిన్సిపాల్ పూర్ణిమ చేతులమీదుగా విజేతలకు మెమొంటోలు, నగదు బహుమతులు, ప్రశంసపత్రాలు అందజేశారు. నేషనల్ ప్లేయర్ బొల్లు యాకయ్య, మేకల సూరయ్య, బీరం రాంరెడ్డి, దశరథం, మాచర్ల రమేష్, బిక్షపతి పాల్గొన్నారు.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

ఎల్కతుర్తి: ఓ హోటల్లో పనిచేస్తున్న వర్కర్ ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ధర్మసాగర్ మండలం దేవునూర్‌కు చెందిన గాజుల కోటి(50) తన ప్యామిలీకి దూరంగా ఉంటున్నాడు. 40 రోజుల క్రితం ఎల్కతుర్తికి వచ్చి హోటల్‌లో పనిచేస్తానని హోటల్ యజమాని శ్రీధర్‌ను అడుగగా పనిలో పెట్టుకున్నాడు. హోటల్ నడవకపోవడంతో గత పది రోజులుగా హోటల్ బంద్ పెట్టాడు. ఇంటికి వెళ్లమని యజమాని కోటికి చెప్పగా ఇక్కడే ఉంటానని చెప్పడంతో సరే ఉండమని చెప్పాడు. దీంతో హోటల్‌లోనే తిని పడుకుంటున్నాడు. ఆదివారం యజమాని కుమారుడు గ్యాస్ కోసం హోటల్‌కు వచ్చి వెతుకుతుండగా చీకటిగదిలో ఉరేసుకొని వేలాడుతూ కనిపించాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని మార్చురీకి తరలించినట్లు ఎస్సై గోదారి రాజ్‌కుమార్ తెలిపారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

అనారోగ్యంతో మహిళ..

పలిమెల: అనారోగ్యంతో బాధపడుతున్న మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై తమాషారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పలిమెలకు చెందిన జనగామ లక్ష్మి (55) నాలుగేళ్లుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ అనారోగ్య తీవ్రతను తట్టుకోలేక ఆదివారం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుమారుడు జనగామ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలుకింద పడి గుర్తుతెలియని వృద్ధుడి..

కాశిబుగ్గ : రైలుకింద పడి గుర్తుతెలియని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన వరంగల్–కాజీపేట రైల్వేస్టేషన్ల మధ్య మేఘన బార్ అండ్ రెస్టారెంట్ ఎదురుగా ఉన్న రైల్వేట్రాక్‌పై ఆదివారం జరిగింది. జీఆర్పీ సీఐ నరేష్ కథనం ప్రకారం.. మృతుడు 55 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు, 5.3 ఎత్తు చామనఛాయ గుండ్రని ముఖం కలిగి చాతిపై కుడి పక్క పుట్టుమచ్చ ఉందన్నారు. ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో మృతదేహన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరచామని సీఐ తెలిపారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే హెడ్ కానిస్టేబుల్ కె.భాస్కర్‌ను లేదా 9440361941, 8712658585 నంబర్లలో సంప్రదించాలని సీఐ సూచించారు.

ఇదేమి విచిత్రం!

- గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గం శిలాఫలకం ఆవిష్కరణ



మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గం పేర్లతో కూడిన శిలాఫలకం

హన్మకొండ: గతంలో ఎన్నడూలేని విధంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పాలవర్గం శిలాఫలకాన్ని ఆవిష్కరించడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. హనుమకొండలోని సమ్మయ్యనగర్ వద్ద అభివృద్ధి పనులకు చెందిన మూడు శిలాఫలకాలతో పాటు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గం పేర్లతో కూడిన శిలాఫలకాన్ని మంత్రులు కొండా సురేఖ, ధనసరి అనసూయతో కలిసి రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, ఇన్ఫర్‌మేషన్ అండ్ పబ్లిక్ రిలేషన్స్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. మేయర్, డిప్యూటీ మేయర్‌తో పాటు కార్పొరేటర్లు 66 మంది పేర్లతో కూడిన శిలాఫలకాన్ని మంత్రి శ్రీనివాస్ రెడ్డి ఆవిష్కరించారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసిన సందర్భంగా ప్రొటోకాల్ ప్రకారం స్థానిక కార్పొరేటర్ పేరు శిలాఫలకంపై చేర్చుతారు. అయితే ఇక్కడ భిన్నంగా కార్పొరేటర్ల పేర్లతో ప్రత్యేకంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించడం వెనుక మతలబు ఏమిటో అని పలువురు చర్చించుకుంటున్నారు.



మంత్రి సీతక్క పేరుపైన పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి పేరుతో ఉన్న శిలాఫలకం

ప్రొటోకాల్ పాటించని అధికారులు

వరంగల్: వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలోని హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో ఆదివారం జరిగిన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల కార్యక్రమంలో రెండు జిల్లాల పాలనా యంత్రాంగం ప్రొటోకాల్ పాటించలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ కార్యక్రమాల్లో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, ధనసరి అనసూయ (సీతక్క) పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కొన్ని శిలాఫలకాల్లో ప్రొటోకాల్‌ను విస్మరించి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పేరు కింద పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, తాగునీటిశాఖ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) పేరును చేర్చడం చర్చనీయాంశంగా మారింది.

ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కటకం రమేష్

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని, అలాగే టీచర్ల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్‌టీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేష్ డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీలోని ఎస్‌డీఎల్‌సీఈ సెమినార్ హాల్‌లో టీఆర్‌టీఎఫ్ రాష్ట్రస్థాయి సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన ఉపాధ్యాయుల బిల్లులను ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా ఉపాధ్యాయుల ఖాతాల్లో జమచేయాలని కోరారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను చేపట్టాలని పేర్కొన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని సూచించారు. స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కావలి అశోక్‌కుమార్, రాష్ట్ర చీఫ్ ప్యాట్రన్ లక్కిరెడ్డి సంజీవరెడ్డి, ఉభయ రాష్ట్రాల కో కన్వీనర్ ద్రాక్షపు విష్ణుమూర్తి, రాష్ట్ర బాధ్యులు సమత, కిషన్ పాల్గొన్నారు.